క్లుప్తంగా

ఘనంగా పోలమాంబ అమ్మవారి పండగ



విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు

అల్లిపురం: కొబ్బరితోటలో వెలసిన పోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అమ్మవారికి భక్తులు స్వయంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఘటాలతో కొబ్బరితోట మెయిన్‌రోడ్డు, మురళీధర వీధి, అచ్చియ్యమ్మపేట ప్రాంతాల్లో డప్పు వాయిద్యాలతో తిరువీధి నిర్వహించారు. సాయంత్రం కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పట్టాలను 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మంగళవారం పంపిణీ చేశారు. పలువురు ఇళ్లుండీ ఏవిధమైన పత్రాలు లేక అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో రూ. 35 వేలు చెల్లిస్తే ఇల్లు సొంతం చేసుకోవడమే కాకుండా ఇంటికి రిజిస్ట్రేషన్, భూమి విలువ, బ్యాంక్ లోన్లకు అవకాశం కల్పిస్తు వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం ద్వారా అనేక మందికి సొంతింటి కల నేరవేరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వార్డులో రూ. 35 వేలు చెల్లించిన వారందరికీ భాస్కరరావు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో నిర్వహించాలనుకున్న దుకాణాల వేలం పాట వాయిదా వేసినట్లు జెడ్సీ కె.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జోనల్ కార్యాలయం నాలుగో అంతస్థులో జీవీఎంసీకి సంబంధించిన షాపుల వేలం నిర్వహించామన్నారు. అయితే ఎవరూ రాకపోవడం వలన దుకాణాల ఆక్షన్ ఈనెల 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు జెడ్సీ తెలిపారు.

గర్భిణుల సమాచారం నమోదు చేయాలి



ఆశ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ఆశ డే సందర్భంగా స్వర్ణభారతి స్టేడియం వద్ద గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో కిల్కారి మొబైల్ సేవల గురించి ప్రస్తావించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త తన పరిధిలో నమోదైన గర్భిణి విధిగా కిల్కారి సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశ డే సందర్భంగా ప్రోగ్రాం అధికారులు తమ ఆశ కార్యకర్తలకు కిల్కారి యాప్ గురించి, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణపై అవగాహన

సీతంపేట: డెంగ్యూ, మలేరియా జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నియంత్రణపై 25వ వార్డు కనకమ్మ వీధిలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది సుధాకర్ మంగళవారం అవగాహన కల్పించారు. వారం రోజులకు పైబడి మంచి నీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని సూచించారు. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలపై మూతలు పెట్టాలన్నారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు.

దారీ తెన్నూ లేదు

- పార్కింగ్ ఎక్కడో కానరాదు
- కేజీహెచ్ ఓపీ గేటు వద్ద ద్విచక్రవాహన చోదకుల ఇక్కట్లు



కేజీహెచ్ లోపలికి వాహనాలకు అనుమతి లేకపోవడంతో రద్దీగా మారిన వార్డుభాయ్‌లేన్



వాహనాలు అడ్డంగా నిలపడంతో అతి కష్టంపై లోపలికి వెళ్తున్న 108 వాహనం

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఆరోగ్యప్రదాయిని కేజీహెచ్ నిత్యం పేషెంట్లు.. వారి సహాయకులతో కిక్కిరిసి ఉంటుంది. విశాఖ నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడికే వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కేజీహెచ్ నలుమూలల ఉండే గదుల్లో ఉంటున్నారు. కేజీహెచ్ ఓపీకి వచ్చే నగర వాసులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనాలపై వచ్చే పేషెంట్లు వారి వాహనాలు నిలిపేందుకు లోపలికి అనుమతి ఇవ్వకపోవడంతో వాటిని నడి రోడ్డు మీదే నిలపాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై పార్కింగ్ చేసే వాహనాల ఫొటోలు తీసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. పోనీ వార్డు బాయిలేన్‌కు ఆనుకుని ఉన్న కేజీహెచ్ ప్రహరీ వద్ద పార్కింగ్ చేద్దా



కేజీహెచ్ ఓపీలోకి అనుమతించకుండా ఏర్పాటు చేసిన బోర్డులు

మనుకుంటే స్థానికులు పార్కింగ్ చేయనివ్వడం లేదని వాహన చోదకులు 'సాక్షి'దృష్టికి తీసుకొచ్చారు. కేజీహెచ్ ఓపీ గేట్ లోపలికి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనుమతి ఇవ్వకపోవడంతో మెయిన్‌రోడ్డుపైనే వాటిని నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. అలాగే కేజీహెచ్ పరిసర ప్రాంతాలు కూడా ట్రాఫిక్‌తో నిండి ఉంటున్నాయి. అంతేగాక 108 వాహనాలు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

రద్దీ అంతా మధ్యాహ్నం వరకే..

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఓపీ విభాగం పనివేళలు అప్పుడే కనుక. ఇదిలా ఉండగా.. మధ్యాహ్నం 2 నుంచి రద్దీ తగ్గినప్పటికీ ఓపీలోకి ఎటువంటి వాహనాలు అనుమతించకపోవడంపై పలువురు మండిపడుతున్నారు. పార్కింగ్‌కు దారి చూపకపోతే.. కేజీహెచ్‌కు వచ్చే పేషెంట్ల సహాయకులు వాహనాలు ఎక్కడ నిలుపుకోవాలో తెలియడం లేదని, పోనీ రోడ్డుపై వాటిని ఒక వారగా పెట్టుకుంటే పోలీసులు చలానాలు అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారుల వద్దకెళ్లి పింఛన్ల పంపిణీ



ప్రసాద్‌గార్డెన్స్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కిరణ్ తదితరులు

జగదాంబ: పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుందని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. మంగళవారం ఆయన ప్రసాద్‌గార్డెన్స్ వద్ద వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం చూడాలన్న జగనన్న ఆకాంక్ష నేరవేరుతోందన్నారు. ప్రతినెల ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వాలన్న సంకల్పం నేరవేరుతుందన్నారు. మంగళవారం 98 శాతం పింఛన్లు సెక్రటరీలతో కలిసి పంపిణీ చేసినట్లు తెలిపారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి..

అల్లిపురం: లబ్ధిదారు ఎక్కడ ఉంటే అక్కడికెళ్లి పింఛను అందజేస్తుంది వలంటీర్ వ్యవస్థ. జీవీఎంసీ 33వ వార్డు, గౌరీస్ట్రీట్ సచివాలయ పరిధిలో నివసిస్తున్న శరగడం ఆదినారాయణ (64) అనే వృద్ధుడు గుండెపోటుతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అతనికి సచివాలయ కార్యదర్శి పీవీ కిరణ్‌కుమార్, జాన్‌బాబు, వలంటీర్ జాగరపు కిరణ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారు మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగులేక హాస్పటల్‌లో ఉన్నా తనను వెదుక్కుంటూ వచ్చి వలంటీర్, సచివాలయ సిబ్బంది జగనన్న పింఛన్ అందజేయటం ఆనందంగా ఉందన్నారు.

పేదలకు అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి, జాన్‌వెస్లీ, రవీంద్రభరత్ తదితరులు



దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సనపల రవీంద్రభరత్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో కమిట్‌మెంట్‌తో పార్టీకి పనిచేసే నాయకుల్లో జాన్‌వెస్లీ ముందుంటారని పేర్కొన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు మూడు రోజుల ముందుగానే అభిమానులు చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు రుణపడి ఉంటానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లోనే పార్టీకి విధేయుడిగా మెలుగుతానని అందుకు అనుగుణంగానే సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. సేవా కార్యక్రమాలు నిర్వహించిన సనపల రవీంద్ర భరత్‌ను అభినందించారు. కార్యక్రమంలో రీసు అనురాధ, ఎం. రమేష్, కంటిముచ్చు సాగర్, కందుల అమర్నాథ్, సీహెచ్ నూకరాజు, సీహెచ్ ఈశ్వర రావు, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

అల్లిపురం: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ జన్మదినం సందర్భంగా 32వ వార్డు పరిధి గోకుల్ థియేటర్ వద్ద ఏపీఐఐసీ డైరెక్టర్ రీసు అనురాధ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ పాల్గొని దివ్యాంగులు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడమంటే దేవునికి సేవ చేసినట్లే అన్నారు. అలాంటి కోవకు చెందిన వారే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో ఇప్పటికే రూ. 2లక్షల కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరల జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కనకల ఈశ్వర్, సనపల రవీంద్ర భరత్, ఎం.రమేష్, రాజు, తేజ, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

భక్తుల సేవలో పట్టా ఫౌండేషన్



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని తదితరులు

డాబాగార్డెన్స్: భక్తుల సేవలో పట్టా ఫౌండేషన్ తరిస్తోంది. 14 గ్రామాల కల్పవల్లి కరకచెట్టు పోలమాంబ వార్షిక జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఫౌండేషన్ మంగళవారం ఆలయ ప్రాంగణం వద్ద మజ్జిగ వితరణ చేపట్టింది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఆలయ చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు స్వాతిదాస్, ముప్పల లక్ష్మి మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించి భక్తులకు చల్లని మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ పట్టా ఫౌండేషన్ నిస్వార్థంగా, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నగరంలోనే గాక జిల్లా నలుమూలల చేపట్టడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి జిల్లాలోను ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి సన్నిధిలో భక్తుల కోసం మజ్జిగ వితరణకు అవకాశం ఇచ్చిన ఆలయ చైర్మన్ శంకర్‌రెడ్డి, పాలకవర్గానికి పట్టా కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఆదివారం ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక దేవాలయంలో కూడా భక్తులకు మజ్జిగ వితరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జి. దేముడుబాబు, బొడ్డేడ వెంకటలక్ష్మి, ఆర్. భాస్కరరావు, దొడ్డి రమేష్, పి. తాతానాయుడు, పెంటకోట శ్రీలక్ష్మి, శ్రీదేవి, అచ్చన్న, గంగునాయుడు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్



ఫిషింగ్ హార్బర్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద ఎమ్మెల్యే వాసుపల్లికి సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలు

అల్లిపురం: ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజాదర్బార్ నిలిచిందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఫిషింగ్ హార్బర్, లక్ష్మీటాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 39వ వార్డు పరిధి కోటవీధిలో హెవీ కంటైనర్ లారీలు రాత్రి, పగలు తేడా లేకుండా తిరుగుతుండటంతో వాయు, ధ్వని కాలుష్యం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాసుపల్లికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పోర్టు డిప్యూటీ చైర్మన్, వీసీపీటీఎల్ యాజమాన్యం, పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్య త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మత్స్యకారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ విజయను ఆదేశించారు. సాంకేతిక కారణాల వలన పెన్షన్లు నిలుపుదల చేసిన వారికి రోల్‌బాక్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల శ్రీధర్, ఫిషరీస్ అసోసియేషన్ సభ్యులు వీరన్న, బర్రి కొండబాబు, రాము, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సంకాభక్తుల సన్యాసిరావు, యల్లపు రఘురామ్, ముజీబ్‌ఖాన్, రఫీ, సాగర్, రామరాజు, చింతకాయల వాసు, బోణి దేవ, తిత్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జర్నలిస్టుల వినతి



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు

మహారాణిపేట : జర్నలిస్టుల అక్రిడేషన్ల మంజూరుపై ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సవరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ విశాఖ నగర అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రరావు, చంద్రమోహన్ కోరారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. జీవోలో కొన్ని సవరణలు చేయాలన్నారు. యూనియన్ల ప్రతినిధులను అక్రిడేషన్ కమిటీలో నియమించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు మన భూమి సత్యనారాయణ, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విస్సా కుమార్ తదితరులు ఉన్నారు.

నేర నియంత్రణకు సహకరించాలి



ఏసీపీ శిరీషను సత్కరిస్తున్న వాసుపల్లి జానకిరామ్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో నేరాల నియంత్రణకు బోటు యజమానులు, మత్స్యకారులు సహకరించాలని ఏసీపీ శిరీష అన్నారు. మంగళవారం ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వాసుపల్లి జానకిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బయటి వ్యక్తులు హార్బర్‌లోకి రాకుండా బోట్ యజమానులు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఎంట్రీ పాసులు మంజూరు చేయాలని, వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని తెలిపారు. అధ్యక్షుడు జానకిరామ్ మాట్లాడుతూ వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ రాత్రిళ్లు కూడా గస్తీ కాస్తు నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి విడతగా ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ఏసీపీ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ శిరీషను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి నరసింహులు, క్రైం ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ రవి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంటు దానయ్య, దూడ పోలయ్య, గనగళ్ల రాజేష్ పాల్గొన్నారు.

రెల్లివీధిలో అంబేద్కర్ వివాహ మహోత్సవం



పేద మహిళలకు చీరలు అందజేస్తున్న లా కాలేజీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు

డాబాగార్డెన్స్: నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావు నేతృత్వంలో 37వ వార్డు పరిధి రెల్లివీధిలో బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్‌వీ విజయలక్ష్మి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపా గోవిందరాజు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు తదితరులు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణంగా ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, కస్తూరి వెంకట్రావు బాబా సాహెబ్ వివాహ దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాడుగుల భాస్కర్, పరదేశియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి




సర్వజన మనోరంజనిపై తిరువీధిలో అప్పన్న



వేణుగోపాలస్వామి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా మనోరంజని వాహనంపై అధిష్టంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారిణుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

వైభవుని సన్నిధిలో పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం చైత్ర పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వైభవునికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఉదయం 6.30గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే వారు మంగళధ్వని, వేదమంత్రోచ్చరణతో అభిషేక ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. అనంతరం పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత



గర్భిణులకు జగనన్న కిట్లు అందజేస్తున్న గౌరి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

సీతమ్మధార : వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను గర్భిణులు, బాలింతలకు మంగళవారం నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ గౌరీ పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా జొన్నపిండి, బెల్లం, అటుకులు, ఎండు ఖర్జూరం, వేరుశనగ అచ్చు, రాగిపిండి, గుడ్లు అందజేశారు. ఈ సెంటర్‌లో గర్భిణులు 27 మంది, బాలింతలు 31 మంది ఉన్నట్టు ఆమె తెలిపారు.

53వ వార్డులో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 53వ వార్డు 298 సచివాలయం పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్లు, గృహసారథులతో సచివాలయంలో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, వార్డు పరిశీలకుడు అమర్, కన్వీనర్లు ఝాన్సీ, షేక్ బాబ్జీ, చాందిని, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా 46వ వార్డు శాంతినగర్ సచివాలయంలో కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విజయమే లక్ష్యంగా పని చేద్దామన్నారు.

మహిళా పోలీసులకు కళ్లద్దాల పంపిణీ



మహిళా పోలీసులకు కళ్లద్దాలు అందిస్తున్న డాక్టర్ విశ్వామిత్ర

సీతంపేట: దృష్టి లోపాలతో ఇబ్బంది పడుతున్న 91 మంది మహిళా పోలీస్ సిబ్బందికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 8న స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 150 మంది మహిళా పోలీసు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి మంగళవారం ఉదయం డీసీపీ కార్యాలయంలో కళ్లద్దాలు అందజేశారు. ముఖ్యమంత్రి కంటి కేంద్రం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ సునీల్ గరుడ్, నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఆప్తమాలిక్ ఆఫీసర్లు ఎం.ఉమాశ్రీనివాస్, ఆర్.సురేష్ పాల్గొన్నారు.